C.P. Brown ACADEMY సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో

విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

రాయల వారి ఉద్యానవనం.

మల్లెలు, జాజులు, మందారాలు, సంపెంగలు విరబూసి ఉన్నాయి. మరువం, దవనం పొదలూ, అనేక రకాల వృక్షాలూ, ఎటు చూసినా పచ్చదనం, ఘుమఘుమలూ, విరిసిన రంగు రంగుల పూలూ. ఆ పరిసరాలన్నీ పరిమళాలు గుమ్మ రిస్తూ, కళ్ళకీ, నాసికా రంధ్రాలకూ కూడా విందు చేస్తున్నాయి.

రాయలవారు చిరునవ్వుతో తిరుగుతున్నారు. ప్రకృతిని చూసి పరవశించిన ఆ సమయంలో ఆయన సర్వం మరిచారు. అన్నీ మరిచిన రాయలవారు ఆనందంగా విహరిస్తున్నారు.

ఇంతలో ఆయన ఆంతరంగికుడు కృష్ణదాసు అక్కడికి వచ్చాడు. కృష్ణదాసు చాలా కాలం నుంచీ దేశాటనంలో ఉన్నాడు.

# హిరణ్య

## మునిపల్లె లక్ష్మీరమణ కుమారి

అతను రాగానే రాయలవారికి వంగి అభివాదం చేశాడు.

రాయలవారు అతన్ని చూసి, సంతోషంగా నవ్వి తిరిగి ఆ సుమబాలల అందాలను ఆస్వాదించ టంలో మునిగిపోయారు. కృష్ణదాసుని కూడా పట్టించుకోకుండా విరిబాలల సొగసు చూసి మురి సిపోతున్నారు.

''దాసూ, ఈ సుమబాలల అందం చూశావా? ఆ సౌకుమార్యం, ఆ సొగసు, సృష్టిలో మరి దేనికీ ఉండవు. గాలికి అవి చేసే నాట్యం ఎంత మనో హరం'' అన్నారు రాయలవారు.

''ప్రభువుల వారు మన్నిస్తే...''

''చెప్పు...''

''ఈ సుమబాలల్ని తలదన్నే సొగసు, సౌకు మార్యం ఉన్న కన్యను చూశాను ప్రభూ. అంతే కాదు. ఆమె అపూర్వ నర్తకీమణి కూడా. ఆమె అందం అపూర్వం. ఆమె నాట్యం అపురూపం. ఆమెని చూశాక, ఈ పుష్పాల అందం కూడా నాకు తెలియడం లేదు'' అన్నాడు.

రాయలవారు కించిత్తు విస్మయం కనబరిచారు.

''నిజంగా ఆమె అంత అందగత్తా?''

''తమ దగ్గర అనృతమా ప్రభూ?'' కృష్ణదాసు దెబ్బతిన్నట్లు చూశాడు.

''సరే, అంత సౌందర్యవతి అన్నమాట. బాగానే ఉంది. ఆమె నాట్యం నువ్వు చూశావా?''

''చూశాను ప్రభూ. చూసి సర్వం మరచాను. నేనే కాదు. ఎవరైనా ఆ అందం, ఆ కళా చూసి తన్మ యులు కాక తప్పదు.''

శ్రీకృష్ణదేవరాయల వారు కళారాధకులు. ఆంధ్ర భోజులు. కళలను ఆదరించడంలో అందరి కన్నా మిన్న. అందుకే ఆయనకొక సందేహం కలిగింది.

''అంత గొప్ప నర్తకీమణి అయితే మరి మాకెం దుకు చెవినబడలేదు?''

''వారిది చాలా కుగ్రామం ప్రభూ. ఆ గ్రామం పేరు కూనవరం. వారిది చాలా పేద కుటుంబం. ఆమె పేరు హిరణ్య. ఆ గ్రామంలో ఉన్న వేణుగో పాల స్వామి ఆలయంలో ఆమె కృష్ణాష్టమి నాడు నాట్యం చేసింది. నేను అప్పుడు అక్కడ ఉండడం తటస్థించింది'' అన్నాడు కృష్ణదాసు.

రాయల వారు తల ఊపారు.

''ఆమె నాట్య ప్రదర్శన తమ ఆస్థానంలో ఏర్పాటు చేస్తే, తగిన ప్రోత్సాహం ఇచ్చినట్లు ఉంటుందని నా మనవి'' అన్నాడు కృష్ణదాసు.

''అలాగే చేద్దాం. నువ్వింత చెప్పాక నాకు కూడా ఆ సుందరి నాట్యం వీక్షించాలని తహతహగా ఉంది సుమా'' అన్నారు రాయలవారు చిరునవ్వుతో.

కృష్ణదాసు మళ్లీ ఇంకొకసారి వంగి అభివాదం చేశాడు.

''అట్లాగే ప్రభూ. నేను కూనవరం వెళ్ళి వారిని స్వయంగా తీసుకొస్తాను'' అన్నాడు.

***

కృష్ణదాసు ఇంటికి తిరిగి వచ్చాడు.

అతను దేశాటనం వెళ్ళి చాలా రోజులైన కారణంగా బంధువులూ, మిత్రులూ చాలా మంది అతన్ని చూడడానికి వచ్చారు. వాళ్ళందరికీ తను వివిధ ప్రాంతాల్లో చూసిన వింతలూ, విడ్డూరాలూ చెప్పాడు.

హిరణ్య ప్రసక్తి కూడా వచ్చింది.

ఆమె అపురూప లావణ్యం గురించి ఆయన చెప్పిన మాటలు విని వాళ్ళు ఆశ్చర్యపోయారు. ఆ సౌందర్యవతిని చూసి తీరాల్సిందేనని తీర్మానించారు.

ఆ నోటా, ఈ నోటా హిరణ్య సౌందర్య ప్రభలు చర్చించబడ్డాయి.

అంతఃపురంలో కూడా చర్చించబడ్డాయి.

''ఆ సౌందర్యం, ఆ కళావైభవం చూడాలని మేమంతా తహతహలాడుతున్నాం. కనీసం ఆమె చిత్రపటమైనా తెచ్చావు కాదు'' అన్నారు చిన్నాదేవి.

''కానీ హిరణ్య సౌందర్యం అలేఖ్యం. ప్ర చిత్రకారుడు కూడా ఆ మహా సౌందర్యానికి న్యాయం చెయ్యలేడు'' అన్నాడు కృష్ణదాసు.

''అసలు నిజంగా ఆ సుందరి ఉందా? లేక ఆమె నీ ఊహా సుందరా?'' చిన్నాదేవి గారు నవ్వుతూ ప్రశ్నించారు.

''ఊహాసుందరులనూ, స్వప్న సుందరులనూ తలదన్నే సజీవ సుందరి'' కృష్ణదాసు నవ్వుతూ చెప్పాడు.

''రేపే మీరు ఆ సుందరిని ఆహ్వానించేందుకు బయల్దేరండి'' రాణిగారు అన్నారు.


కృష్ణదాసు తల ఊపాడు.

***

పల్లకీ సాగిపోతోంది.

కృష్ణదాసు బయటకి చూస్తున్నాడు. ఎటు చూసినా పచ్చటి ప్రకృతి. ఆకుపచ్చటి చేలూ, చెట్లూ కూనవరం దరిదాపులకి వచ్చేశాం అని తెలుపుతున్నాయి. మామిడి, పనస తోటల నుంచి వస్తున్న వాసన ముక్కుపుటాల్ని గుబాళింపచేస్తోంది.

తను కూనవరం వచ్చి చాలా రోజులే అవుతోంది. గ్రామంలో ఏమీ మార్పు లేదు. తోటలోని చెట్ల అందాలూ మారలేదు. రమణీయ ప్రకృతి అందం చెక్కు చెదరలేదు.



కృష్ణదాసు వస్తున్నాడని తెలిసి, గ్రామాధికారి పరుగున ఎదురు వచ్చాడు.

''ముందుగా మాట మాత్రం సెలవిస్తే, సకల ఏర్పాట్లూ చేసి ఉండేవాళ్ళం'' అన్నాడు.

''ఫర్వాలేదు. ఒక ముఖ్యమైన కార్యం మీద వచ్చాను. వచ్చిన పని పూర్తయితే చాలు'' అన్నాడు కృష్ణదాసు.

గ్రామాధికారి కృష్ణదాసు ఆ పనేమిటో చెప్తుతాడేమోనని ఎదురు చూశాడు. కానీ, కృష్ణదాసు ఏమీ చెప్పలేదు.

స్నానపానాదులు పూర్తయ్యాక తను వచ్చిన పని చెప్పాడు కృష్ణదాసు.

గ్రామాధికారి మొహం వెలవెలబోయింది.

"తమరు కాస్త ముందు వస్తే బాగుండేది. ఆమె ఇప్పుడు ఇక్కడ లేదు'' అన్నాడు.

కృష్ణదాసు నిరుత్సాహ పడ్డాడు.

"అయ్యో...అట్లాగా? మరి ఎక్కడ ఉంది?''

గ్రామాధికారి ఇచ్చిన వివరాలు తీసుకుని, హిరణ్య అన్వేషణలో బయల్దేరాడు కృష్ణదాసు. పల్లకినీ, బళ్ళనూ తన వెనక రమ్మని, తను అశ్వం మీద బయల్దేరాడు.

అతని అన్వేషణ అట్లా సాగిపోయింది.

హిరణ్య జాడలేదు.

అక్కడికి వెళ్తే ఇక్కడికి వెళ్ళమనీ, ఇక్కడికి వెళ్తే అక్కడికి వెళ్ళమనీ అంటున్నారు. అతను నిర్విరామంగా తిరుగుతూనే ఉన్నాడు.

అన్వేషణ క్లిష్టం అయిన కొద్దీ అతని పట్టుదల పెరుగుతోంది. ఆ అన్వేషణలోనే కొన్ని మాసాలు కూడా గడిచిపోయాయి.

జీమూత గ్రామంలో ఉండగా రాణివారు పంపిన దూత వచ్చాడు.

"ఏం జరిగింది? ఎన్నాళ్ళయినా తిరిగి రాలేదని రాణీ వారు అడుగుతున్నారు'' అన్నాడు.

కృష్ణదాసు పై ప్రాణాలు పైనే పోయాయి. రాజుల కొలువు కత్తి మీద సాములాంటిదంటారు. ఆగ్రహం కలిగినా, అనుగ్రహం కలిగినా వారిని పట్టలేం. హిరణ్య నిజంగా ఉందా, లేక ఊహాసుందరా అని రాణీ వారు హాస్యంగానైనా అడగనే అడిగారు. వారికి ఆగ్రహం తెప్పిస్తే ఇంకేమన్నా ఉందా?

"ఆ పనిమీదే ఉన్నాను. త్వరలోనే తిరిగి వస్తానని విన్నవించుకుంటున్నాను'' అన్నాడు.

ఆ తర్వాత తీవ్రంగా అన్వేషణ కొనసాగించాడు. అతని అన్వేషణ ఫలించింది.

హిరణ్య కనిపించింది.

ఆమె కుటుంబంతో తిరుగు ప్రయాణమయ్యాడు.

***

చిన్నాదేవి గారి అంతఃపురం.

చిన్నాదేవీ, కొందరు దాసీలు తప్ప మరెవరూ లేరు. కృష్ణదాసు హిరణ్యని తీసుకొని వస్తున్నాడట. వారంతా ఆమెని చూడాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

కృష్ణదాసు ముందుగా ప్రవేశించాడు.

అతని వెనుక నిలువెల్లా మేని ముసుగు ధరించిన ఒక స్త్రీ మూర్తి.

ఆమె రాగానే రాణీగారికి వంగి అభివాదం చేసింది.

ఆమె దానిని చిరునవ్వుతో స్వీకరించారు.

"రా హిరణ్యా, నీ సౌందర్యం గురించి విన్నాం. నీ నాట్యం రేపు ఆస్థానంలో అందరితో పాటు తిలకిస్తాం. ప్రస్తుతానికి నీ అందంతో మా కనులకు విందు చేస్తావని ఎదురు చూస్తున్నాం. నా ముందు ఈ ముసుగెందుకు?'' అన్నారు చిన్నాదేవి.

ఆ స్త్రీ కొంచెం తటపటాయించి, చివరకి తన ముసుగు తొలగించింది.

అంతే...అంతా అవాక్కయ్యారు.

ఆమె దేహం అమిత స్థూలంగా ఉంది. దానికి తోడు బానలా పొట్ట. చేతులూ, కాళ్ళూ విపరీతంగా లావెక్కి అరటి బోదల్లా ఉన్నాయి. కళ్ళల్లో తళతళలు లేవు సరికదా అదో మాదిరి రోగిష్ఠితనం ఉంది. మొహం లావెక్కి, దవడలు జారి, ఒకప్పుడు సౌందర్యవతి ఏమో అని పోలికలు తెలుస్తున్నా, ఆ మొహం ఆకారం మారి, వికృతంగా ఉంది. జుట్టు బాగా ఊడిపోవడం వల్ల గుండు కనిపిస్తూ ఉంది.

అంతా నిర్ఘాంతపోయి చూస్తుండగా, కృష్ణదాసు మెల్లగా నోరు విప్పాడు.

"నేను ఆ గ్రామం నుంచి వచ్చేశాక ఆమె తను ప్రేమించిన వసంతునితో వెళ్ళిపోయింది. ఇద్దరూ వివాహం చేసుకొన్నారు. వాళ్ళకి ఒక బాబు పుట్టాడు. కానీ గర్భం ధరించినప్పుడే ఏర్పడిన మార్పులూ, పురిటి సమయంలో వచ్చిన వ్యాధుల వల్లా, ఆమె తన పోషణ గురించి పట్టించుకోకపోవడం వల్లా ఆమెకీ వికృత రూపం ఏర్పడింది. ఇచ్చిన మాట నెరవేర్చుకోవడం కోసం ఆమెని తీసుకొచ్చాను.''

అంతా నిశ్శబ్దం.

కొంతసేపు మౌనం రాజ్యమేలింది.

ఇంతలో శ్రీకృష్ణదేవరాయల వారు అక్కడికి విచ్చేస్తున్నారని భటులు విన్నవించారు.

అంతా మౌనంగా లేచి నిలబడ్డారు.

రాయలవారు వచ్చారు.

కృష్ణదాసు ఖిన్నుడై కూర్చున్నాడు.

***

రాయల వారి సభ.

అష్టదిగ్గజాలతో, కళామూర్తులతో, కళాపిపాసులతో నిండి ఉన్న ఆ సభ ఆనాడు కిటకిటలాడుతోంది.

హిరణ్యనీ, కృష్ణదాసుని సభకి పిలిపించారట. అంతా తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

హిరణ్య సభలోకి ప్రవేశించింది. ఆమెతో పాటు భర్త, పిల్లవాడు.

వారి వెనుక తలదించుకుని కృష్ణదాసు.

హిరణ్యని చూసి సభలో అంతా ఒక్కసారిగా నివ్వెరపోయారు.

అపురూప సౌందర్యవతినీ, అద్భుత నర్తకీ మణినీ చూపిస్తానని ప్రగల్భాలు పలికి, చివరికి ఈ వికృతరూప స్థూలకాయురాల్ని తీసుకొచ్చిన కృష్ణదాసుకి దండన తప్పదని అంతా భయపడుతున్నారు.

హిరణ్యని సభకి పరిచయం చేశాడు కృష్ణదాసు.

అంతటా నిశ్శబ్దం.

అంతా ఊపిరి బిగపట్టి రాయలవారు ఏమంటారా అని ఎదురుచూస్తున్నారు.

రాయలవారు పెదవి విప్పారు.

కంచుగంట లాంటి ఆ గొంతు తేటతేట తెలుగులో పలికింది.

"హిరణ్య ఎంతటి సౌందర్యవతో మీరంతా కూడా విని ఉంటారు. ఆమె గర్భం ధరించినప్పుడూ, ఆ తర్వాత ఏర్పడిన మార్పులూ, ఆ పిమ్మట వచ్చిన ఒకానొక వ్యాధి వల్ల తన సౌందర్యాన్ని కోల్పోయింది. స్త్రీ తన పెన్నిధిలన్నింటిలోకి అపూర్వంగా భావించే పెన్నిధి ఆమె సౌందర్యం. కానీ మాతృత్వం వల్ల ఒకోసారి ఆ సౌందర్యాన్ని కూడా కోల్పోతుంది. అయినా ఏ స్త్రీ కూడా దాన్ని గురించి బాధపడదు. ప్రతి కాన్పూ స్త్రీకి మరో జన్మ. అయినా సరే, మృత్యువుని సైతం ధిక్కరించి, ప్రతి స్త్రీ బిడ్డని కనడానికి సిద్ధపడుతుంది. తన అద్భుత సౌందర్యాన్నే పణంగా పెట్టి, బిడ్డకి జన్మనిచ్చిన ఈ అపూర్వ మాతృమూర్తిని మాకు పరిచయం చేసిన కృష్ణదాసుకి మా అభినందనలు తెలియజేస్తున్నాను. బిడ్డ కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడే మాతృమూర్తి సౌందర్యం మహోత్కృష్టం. ఆ సౌందర్యాన్ని మనందరికీ ఆవిష్కరింపజేసిన హిరణ్యకు మనమంతా కృతజ్ఞులం'' అన్నారు.

సభ మొత్తం కరతాళ ధ్వనులతో దద్దరిల్లింది.

"హిరణ్య ఆరోగ్యం బాగుచేసుకోవడానికి కావలసిన ధనం సమకూరుస్తాం'' అన్నారు రాయలవారు.

అంతా మళ్ళీ కరతాళ ధ్వనులు చేశారు. హిరణ్య తన ఒడిలో ఉన్న బిడ్డను ముద్దులాడింది. అపూర్వమైన ఆ దృశ్యాన్ని చూసిన అందరూ పులకించారు.

త్యాగపు శిఖరాల చివరి అంచు మాతృత్వం. ఆ ఔన్నత్యాన్ని గుర్తించిన రాయలవారి మహోన్నత హృదయ సౌందర్యానికి అంతా తలవంచి నమస్కరించారు.

*

## మాతృమూర్తులే ఈ కథకు ప్రేరణ



యుగాలు గడిచినా, జగాలు మారినా, ఏనాటికీ మారనిది అమ్మ హృదయం. పిల్లల కోసం తల్లి తన సర్వస్వం త్యాగం చెయ్యటానికి సిద్ధపడుతుంది. ఎన్ని త్యాగాలు చేసినా, ఏ మాత్రం బాధపడని మాతృమూర్తులే ఈ కథకు ప్రేరణ.

నేను 'ఎ.డి.ఇ.' కార్యాలయంలో అసిస్టెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. ఇంతవరకూ ఏడు నవలలూ, రెండు నవలికలు, యాభై కథలు రాశాను. నా కథకు బహుమతి ఇచ్చి ప్రోత్సహించిన సి.పి.బ్రౌన్ అకాడమీ-నవ్య వీక్లీ వారికి నా కృతజ్ఞతలు.

-మునిపల్లె లక్ష్మీరమణకుమారి
9391116702